
# అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily


Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం 06-11- 2026 సంపుటి : 6 సంచిక : 261 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## పెరిగిన చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ రద్దీ.



- దీపావళి వేళ భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- నవంబరు 6 నుంచి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- మదీనా, ముర్గీ చౌక్, షా అలీ బండ మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అవకాశం
- ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసుల సూచన
- వాహనదారుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం
- ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి

2లో

## అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం
- అంతర్జాతీయ పోటీల నిర్వహణకు ప్రణాళికాబద్ధమైన చర్యలు
- గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026
- పుల్లెల గోపీచంద్ అకాడమీలో కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు
- నవంబరు 3 నుంచి 8 వరకు అంతర్జాతీయ టోర్నమెంట్
- పతిభ చాటే క్రీడాకారులకు ప్రభుత్వ అండ
- దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచేలా ప్రోత్సాహం

2లో



## జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపే లక్ష్యం



2లో

- ఆరు నెలల్లో ఖాళీ చేయిస్తామని ఈటల రాజేందర్ వెల్లడి
- తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు
- దేవరయాంజాల్‌లో మల్కాజిగిరి
- పార్లమెంట్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

## కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల మరమ్మతులపై చర్చిద్దాం

- ప్రతిపక్షం దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- మూడు బ్యారేజీల పరిస్థితి చెబుదాం
- వాటి మరమ్మతు చర్యలను వివరిద్దాం
- మూడేళ్లు ఎందుకు పట్టిందో కూడా చెప్పాలి
- మంత్రులు గోదారి ప్రాజెక్టులు సందర్శించాలి
- నీరు వృథా కావట్లేదని ప్రజలకు వివరించాలి
- మంత్రులతో సమావేశంలో సీఎం రేవంత్
- రూ.4193 కోట్లతో 3 బ్యారేజీల పునరుద్ధరణ
- వచ్చే నెలలో మరమ్మతు పనులు ప్రారంభం
- కాళేశ్వరం మరమ్మతులపై అసెంబ్లీలో సమగ్ర చర్చకు సీఎం నిర్ణయం
- ఈ నెలాఖరులో రెండు రోజుల పాటు ప్రత్యేక సమావేశాలు
- మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూ.4,193 కోట్ల అంచనా
- డిసెంబరులోనే మరమ్మతు పనులు ప్రారంభించాలని ఆదేశం
- బీఆర్ఎస్ ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగా తిప్పికొట్టాలని మంత్రులకు సీఎం సూచన
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితిపై సభలో వివరణ
- మూడేళ్లుగా మరమ్మతులు ఎందుకు ఆలస్యమయ్యాయో ప్రజలకు చెప్పాలి



హైదరాబాద్, **అభ్యుదయం**

కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల మరమ్మతులపై ఈ నెలాఖరులోగా అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి సమగ్రంగా చర్చిద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో అన్నారు. గోదావరి నీళ్లను కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా ఎత్తిపోయకుండా ఆంధ్రాకు వదిలేస్తున్నారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని అసెంబ్లీ వేదికగానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గురువారం క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం.. రెండు రోజుల పాటు సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కాళేశ్వరం బ్యారేజీలపై సమీక్షించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు రూ.4193 కోట్లు వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. డిసెంబరులో మరమ్మతులు ప్రారంభించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అనంతరం జరిగిన క్యాబినెట్ భేటీలోనూ ఈ అంశంపై చర్చించారు. ఎన్‌డీఎస్‌ఏ చెప్పినట్లు ప్రాజెక్టుకు అన్ని రిపేర్లు పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలని క్యాబినెట్ నిర్ణయించింది కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సభలో చర్చిద్దామని మంత్రులతో సీఎం అన్నారు. మూడు బ్యారేజీల పరిస్థితి ఏంటి? వాటిలో నీటిని నిల్వ చేస్తే తట్టుకునే పరిస్థితి ఉందా?

మిగతా 2లో

## యువత ఆవిష్కరణకు రెక్కలు తొడిగిన టీహబ్..!

- ప్రపంచ ఆవిష్కరణల పటంలో టీ హబ్‌తో హైదరాబాద్‌కు గుర్తింపు
- కేసీఆర్ హయాంలో రూపుదిద్దుకొని 3,300కు పైగా ఆవిష్కరణలకు అండ
- రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు
- టీహబ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా కేటీఆర్ ప్రశంసలు
- 1. 11 ఏళ్లలో 3,300కు పైగా స్టార్టప్‌లకు టీహబ్ ప్రోత్సాహం
- కేసీఆర్ దూరదృష్టితో ప్రపంచస్థాయి ఆవిష్కరణల కేంద్రంగా టీహబ్
- యువత కలలను సాకారం చేస్తున్న టీహబ్
- హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఆవిష్కరణల రంగంలో ప్రత్యేక గుర్తింపు
- యువ పారిశ్రామికవేత్తలకు అండగా నిలుస్తున్న టీహబ్
- మెంటార్లు, పెట్టుబడిదారులతో స్టార్టప్‌లకు అనుసంధానం
- నూతన ఆలోచనలకు ప్రోత్సాహం.. యువతకు ప్రపంచస్థాయి



హైదరాబాద్, **అభ్యుదయం**

'కలలకు రెకలు తొడగడం' అనే నినాదానికి టీ హబ్ నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలకు కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే దూరదృష్టితో కేసీఆర్ హయాంలో టీహబ్‌ను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. 11 ఏండ్ల ప్రస్థానంలో వేలాది మంది యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అండగా నిలిచి, వారి ఆలోచనలను విజయవంతమైన స్టార్టప్‌లుగా మార్చేందుకు ఈ సంస్థ విశేషంగా కృషి చేసిందని ప్రశంసించారు. టీహబ్ తన 11 ఏండ్ల ప్రయాణం లో ఇప్పటివరకు 3,300కుపైగా

మిగతా 2లో

## ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు



2లో

- ట్రంప్ నియంత్రణలో మోదీ పనిచేస్తున్నారంటూ ఆరోపణలు
- చర్చకు వస్తే ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని సవాల్
- పార్లమెంటులో తన మైక్ కట్ చేస్తున్నారని మండిపాటు

## అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల లెక్క

-గడువు దాటితే వెంటనే విడుదల చేయాలని స్పష్టీకరణ

-అసలు నిర్బంధ సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలి

-అరెస్ట్ పై పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన!



2లో

# కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీల మరమ్మతులపై చర్చిద్దాం

.ఎన్‌డీఏ?సఏ ఏం నివేదికలు ఇచ్చింది? మరమ్మతులకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకోనుంది?
అసలు మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇందుకు మూడేళ్ల సమయం ఎందుకు పట్టింది? దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా గత ప్రభుత్వాల కంటే సమర్థవంతంగా నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నాం? ఈ వివరాలన్నీ సభలో చర్చిద్దామని చెప్పారు. ఈ అంశాలపై బీఆర్ఎస్ నేతలకూ మాట్లాడే అవకాశం ఇద్దామన్నారు. బీఆర్ఎస్ నేతలు, ఆ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారానికి అసెంబ్లీ వేదికగా ప్రజలకు సమాధానం ఇవ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు.
మరమ్మతులు చేయకుండా మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేసే పరిస్థితి లేదని, అవి పని చేయకుండా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే పరిస్థితి కూడా లేదని సీఎం మంత్రులకు వివరించారు. ఇది తెలిసి కూడా బీఆర్ఎస్ నాయకత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. వాస్తవాన్ని రైతులు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు ఆ రెండు ఎత్తిపోతల ప్రాజెక్టులను సందర్శించాలని ఆదేశించారు. కాళేశ్వరానికి గుండెకాయ లాంటి మూడు బ్యారేజీలు పని చేయకున్నా గోదావరి నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నామో ప్రజలకు చూపించాలని చెప్పారు. సందర్శనకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులనూ తీసుకెళ్లాలన్నారు. సీఎం ఆదేశాల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క ఈ ప్రాజెక్టులను సందర్శించనున్నారు.

### లోపాల సవరణ బాధ్యత నిర్మాణ సంస్థలదే

నిర్మాణపరమైన లోపాలను ఎల్ అండ్ టీ(మేడిగడ్డ), అఫ్కాన్స్(అన్నారం), నవయుగ(సుందిళ్ల) సంస్థలే సరి చేయాల్సి ఉంటుందని, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించాలని సమీక్షలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారం పునరుద్ధరణ పనులు చేపట్టి, దెబ్బతిన్న బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తేవాలని సీఎం నిర్దేశించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

### ప్రస్తుత పరిస్థితుల్లో లిఫ్ట్ సాధ్యం కాదు

బ్యారేజీలు ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కన్నెపల్లి(ప్రాణహిత) వద్ద కనిపించే నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటి పారుదల శాఖ ఇంజనీర్లు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు మూయాల్సి ఉంటుందని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న ఈ రెండు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని(ఫ్రీ ఫ్లో) జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నీళ్లున్నా లిఫ్ట్ చేయడం లేదన్న తప్పుడు ప్రచారాన్ని ఈ సమాచారంతో తిప్పికొట్టాలని సీఎం మంత్రులకు సూచించారు. మేడిగడ్డ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు నివేదించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్రం ఏర్పాటు చేసిన టెక్నికల్ ఓవర్ సైట్ కమిటీ ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వివరించారు.

# ఏపీలో ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్

కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది.
రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

# ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు

కేంద్రం ప్రభుత్వం పై, ప్రధాని నరేంద్రమోదీ పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు. తనతో చర్చకువస్తే మోదీ దేశ ద్రోహి అనే ఆ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు.
ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని విమర్శించారు. దేశంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో..? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. తాను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నానని, అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి..? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి..? అని ప్రశ్నించారు. మీరు పైకి శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు.
ఒకవేళ అమిత్ షా శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పాలని రాహుల్‌గాంధీ అన్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌పైనా రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ వారు ఎక్కడ నిర్మూలించారని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను నిర్మూలించారా..? అని నిలదీశారు.సమస్యను అంతంచేసే సామర్థ్యం వారికి లేదని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగవంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారని, ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడదని మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు

## -మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి, భీమోదయం: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ఓటు వేయడానికి కూడా ముందుకు రాకుండా ఓటమి భయంతో పారిపోయారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం, ఎన్నికల పారదర్శకత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంపై జగన్‌కు నిజంగా గౌరవం ఉంటే ప్రజల తీర్పును శిరసావహించాలి. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక వ్యవస్థలపై నిందలు వేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.
2019లో మెజార్టీ స్థానాలు సాధించినప్పుడు ప్రజల తీర్పుగా చెప్పుకున్న జగన్.. 2024, ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎందుకు గౌరవించడం లేదని మంత్రి ప్రశ్నించారు. శాసనసభ సమావేశాలకు రాకుండా నాలుగు గోడల మధ్య మాత్రమే మైకు ముందు మాట్లాడే జగన్‌కు అధికారం ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం గొప్పగా కనిపించడం, అధికారం కోల్పోయాక అదే వ్యవస్థపై ఆరోపణలు చేయడం ఆయనలోని నైరాశ్యాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియపై జగన్ చేస్తున్న ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎక్కడైనా లోపాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో వాటిని నిరూపించుకోవాలి తప్ప, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సంక్షేమ పాలన వల్ల కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పే అంతిమమని, ఆ తీర్పును గౌరవించలేని జగన్ ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం హాస్యాస్పదమని సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపే లక్ష్యం

మేడ్చల్--మల్కాజిగిరి, నవంబర్ 5
జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించి, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కల్పించడమే లక్ష్యంగా పోరాటం కొనసాగిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆరు నెలల్లో డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి ఖాళీ చేయిస్తామని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.డంపింగ్ యార్డ్ తరలింపు కోసం చేపట్టిన నాలుగు రోజుల పాదయాత్ర, నవంబర్ 2న అమిత్ షా పాల్గొన్న మహా పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా దేవరయాంజాల్‌లోని ఓ స్వ కన్వెన్షన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, దసరా అనంతరం జరుపుకుంటున్న 'అలయ్ బలయ్'గా ఈ సమావేశాన్ని అభివర్ణించారు.

### ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం

రైతుల సమస్యలు, హైడ్రా చర్యలు, మూసీ పరివాహక ప్రాంత పేదల ఇళ్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, అసైన్డ్ భూముల పరిరక్షణ తదితర అంశాలపై బీజేపీ పోరాటాలు నిర్వహించిందని ఈటల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా సమస్యలపై అత్యధికంగా స్పందించిన పార్టీ బీజేపీయేనని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.
జవహర్‌నగర్ పాదయాత్రకు ప్రజల నుంచి వచ్చిన స్పందన తమకు మరింత ధైర్యాన్నిచ్చిందన్నారు. మహిళలు, కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సంఘీభావం తెలిపారని చెప్పారు. ప్రజలను చైతన్యపరిచి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు.

### డీపీఆర్ ఇస్తే కేంద్ర సాయం కోసం కృషి చేస్తా

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఈటల తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సమస్యకు పరిష్కారం సాధించగలమన్న విశ్వాసం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.

### కార్యకర్తల ఐక్యతతోనే విజయాలు

ఎన్నికల్లో విజయానికి కార్యకర్తల ఐక్యత, శ్రమ, పట్టుదలే పునాదులని ఈటల అన్నారు. ఇతర పార్టీల నాయకులతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నంత మాత్రాన ఎన్నికల్లో వారి మద్దతు లభిస్తుందని భావించవద్దని సూచించారు. గ్రామాలు, డివిజన్ల స్థాయిలో పార్టీని బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని కోరారు.

# పెరిగిన చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ రద్దీ..

హైదరాబాద్, నవంబరు 5
దీపావళి సందర్భంగా నగరంలోని చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు నవంబరు 6 నుంచి 11 వరకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. మదీనా, మూర్గీ చౌక్, షా అలీ బండ -- చార్మినార్ రూట్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశముందని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ మార్గాలు వాడాలని సూచించారు. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే భక్తులు వాహనాలను పార్క్ చేయాలని కోరారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు తు.చ. తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు.దీపావళి సందర్భంగా భాగ్యలక్ష్మి ఆలయానికి మీర్‌చౌక్ నుంచి వచ్చేవారికి ముఫీద్ ఉల్ అనామ్ స్కూల్ గ్రౌండ్, సర్దార్ మహల్ రోడ్ దగ్గర పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. షా అలీ బండ నుంచి వచ్చేవారికి చార్మినార్ బస్ టెర్మినల్, యునాని ఆసుపత్రి వద్ద పార్కింగ్ కేటాయించామని వివరించారు.
మదీనా, నాయాపూల్ నుంచి వచ్చేవారు ఎంజీ కాంప్లెక్స్, కాలీ కమాన్ గర్ల్స్ స్కూల్ (ఆదివారం మాత్రమే) సమీపంలో వాహనాలను పార్క్ చేసుకోవాలని సూచించారు. పురానాపూల్, బేగం బజార్ వైపు వారికి వీజీ బ్రిడ్జ్, సిటీ కాలేజ్, ఓపెన్ స్టేడియం వద్ద పార్కింగ్ స్థలం కేటాయించామని తెలిపారు. హుస్సేనీ ఆలం వైపు వారికి న్యూ ముర్గీ చౌక్ ఖిల్వత్ రోడ్, ఝులుఖానా లాడ్ బజార్, ఖిల్వత్ గ్రౌండ్ దగ్గరలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామని చెప్పారు.

# అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, నవంబరు 5
తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -- 2026 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ పోటీలు కొనసాగుతున్నాయి. నవంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.ఈ పోటీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని, ప్రసంగించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా తాము చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.
అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటే క్రీడాకారులకు తమ ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచే క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం కల్పిస్తామని స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల లెక్క

న్యూ ఢిల్లీ, : అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది. త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది.
రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు.
సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది.

# యువత ఆవిష్కరణకు రెక్కలు తొడిగిన టీహబ్..!

స్టార్టప్‌లకు ప్రో త్సాహం అందించిందని వెల్లడించారు.
కొత్తగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలనుకొనే యువతకు మార్గదర్శకత్వం అందించడంతోపాటు అనుభవజ్ఞులైన మెంటార్లు, పెట్టుబడిదారులు, పారిశ్రామికరంగ ప్రముఖులతో అనుసంధానం కల్పించిందని తెలిపారు. ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు స్టార్టప్‌లకు వేదికగా నిలిచిందని గురువారం ఎక్స్ వేదికగా పేరొన్నారు. . తెలంగాణ యువతలోని ప్రతిభను వెలికితీసి, వారికి అవసరమైన సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వం, పెట్టుబడుల అవకాశాలను అందించడంలో కీలకపాత్ర పోషించిందని పేర్కొన్నారు.టీహబ్ విజయవంతమైన ప్రయాణం తెలంగాణ ఆకాంక్షలు, పారిశ్రామిక స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఆవిష్కరణల కేంద్రాల ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చిందని కేటీఆర్ పేరొన్నారు. ఈ సంస్థ ద్వారా హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఆవిష్కరణల రంగంలో ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. టీహబ్ ప్రారంభోత్సవం సందర్భంగా దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు.

# కూకట్‌పల్లిలో కమిషనర్ సృజన క్షేత్రస్థాయి తనిఖీలు

**● జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో కలిసి అభివృద్ధి పనుల సమీక్ష**

**● వై జంక్షన్ పనుల పురోగతిపై ఆరా.. అధికారులకు దిశానిర్దేశం**



కూకట్‌పల్లి, నవంబర్ 05 (అభ్యుదయం న్యూస్):సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఐఏఎస్ కూకట్‌పల్లి సర్కిల్-52 పరిధిలో గురువారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఐఏఎస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పౌర మౌలిక సదుపాయాలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

ఈ పర్యటనలో భాగంగా వై జంక్షన్ వద్ద చేపడుతున్న ఎజ×× పనులను కమిషనర్ స్వయంగా పరిశీలించి, పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీలక్ష్మి, సీసీపీ వెంకన్న, సిటీ ప్లానర్ తులసీరామ్, కూకట్‌పల్లి సర్కిల్-52 డిప్యూటీ కమిషనర్ జి. ఆంజనేయులు, ఏసీపీ వెంకటరమణ తదితర మున్సిపల్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దలాల్ స్ట్రీట్‌లో దివాళీ ధమాకా..

**దూసుకెళ్తున్న స్టాక్‌మార్కెట్లు.. ఇన్వెస్టర్లకు 7 లక్షల కోట్ల బొనాంజా**




ముంబై: దలాల్ స్ట్రీట్‌లో ఇవాళ దివాళీ ధమాకా మొదలైంది. ట్రేడింగ్‌లో స్టాక్‌మార్కెట్లు రఫాడిస్తున్నాయి. సెన్సెక్స్ 1600 పాయింట్లతో దూసుకెళ్తోంది. ఇక నిఫ్టీ తన ట్రేడింగ్‌లో ఇవాళ ఉదయం రెండు శాతం లాభాలను చూపించింది. స్టాక్‌మార్కెట్ల జోష్‌తో ఇన్వెస్టర్ల సంపద పెరిగింది. సుమారు 7 లక్షల కోట్ల లాభాలు పెట్టుబడిదారులకు చేరినట్లు ట్రేడింగ్ ద్వారా తెలుస్తోంది. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోలు శక్తి పెరిగినట్లు తెలిసింది. 30 షేర్ల బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్‌లో ఇవాళ 2.08 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం 1609.54 పాయింట్లు దూసుకెళ్లింది. ఇక నిఫ్టీ50 417.45 పాయింట్ల లాభాల్లో ట్రేడ్ అయ్యింది. నిఫ్టీ షేర్లు 1.74 శాతం వృద్ధి సాధించాయి. బుధవారం స్టాక్‌మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఆ జోరే ఇవాళ ఉదయం కూడా కొనసాగింది.

## కేసీఆర్ బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడితే..

**రేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండు : ఎమ్మెల్యే గంగుల కమలాకర్**




తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మా కడుపు నిండా అన్నం పెట్టి కాపాడారని.. కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్నరేవంత్ రెడ్డి చీకటి జీవో జారీ చేసిండని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేదిక మీదున్న మాతోపాటు ఉన్న మధుసూదనాచారి, శ్రవణ్ కుమార్, వివ్ వివేకానంద, ఎమ్మెల్యేలతోపాటు మేమంతా కూడా బీసీ బిడ్డలం.. ఒకసారి మీకు గత చరిత్రను పత్రికల ద్వారా ప్రజలకు చెప్పాల్సిన అవసరముందన్నారు.

కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2011-12 సంత్సరంలో పొన్నం ప్రభాకర్ కూడా బీసీ సంఘాల్లో తిరిగిండు.. నేను కూడా బీసీ సంఘాల్లో తిరిగానని ఎమ్మెల్యే గంగుల గుర్తు చేశారు. ఆనాడు సీఎం కిరణ్ కుమార్ ఈ హైదరాబాద్ నడిఒడ్డున బీసీ సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే.. మా బీసీ సంఘాలకు హోటళ్లలో కూడా మీటింగ్ ఉండదు కాబట్టి ఎక్కడన్నా చుట్టు పక్కల బీసీ సంఘాలకు 5 గుంటల భూమి ఇవ్వండి అంటే వెకిలిగా నవ్వి.. బీసీ సంఘాలకు ఒక ఆశ్రమం కావాలా..? అని నవ్విన పరిస్థితి ఉండేది. తిరుగగా తిరుగగా నాగార్జున సాగర్ రోడ్లులో 120 కిలోమీటర్ల దూరంలో 5 గుంటల భూమిని ఒక స్మశాన వాటిక పక్కన చూపించిన పరిస్థితి ఉన్నది.. అంటూ బీసీ సంఘాలకు గత కాంగ్రెస్ ప్రభుత్వమున్నప్పుడు వెకిలిగా నవ్వి అవమానం చేసిన పరిస్థితి ఉండేదన్నారు.

**కోకాపేటలో ఆత్మగౌరవ భవనాలు..**


కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకుంటే హైదరాబాద్‌లో ఒక గుంట భూమి కూడా లేని పరిస్థితి ఉంది. ఆ పరిస్థితి తెలుసుకుని కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే.. బీసీలంటే సమాజంలో 60-70 శాతమున్న వ్యక్తులు కాబట్టి మీ ఓట్లతోనే ప్రభుత్వాలు నడుస్తయి కాబట్టి మీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మాది... ప్రప్రథమంగా, ఏ ప్రభుత్వం, ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనటువంటి విధంగా ఆ రోజు 2018లో జీవో నంబర్ 189 ప్రకారం మీ గౌరవాన్ని కాపాడుతం..అందుకే దాని పేరు ఆత్మ గౌరవ భవనాలని చెప్పారని ఎమ్మెల్యే గంగుల స్పష్టం చేశారుభారతదేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని సాహసం జీవో 189 ద్వారా 87.5 ఎకరాల భూమి.. ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఆ డబ్బు కూడా నేను ఇస్తా అని చెప్పి ఎకరానికి కోటి రూపాయల చొప్పున 41 ఈ బీసీ కుల సంఘాలకు సుమారు 97.5 కోట్ల రూపాయలు మంజూరు చేశారన్నారు.

ఎక్కడిస్తారని అంటే.. మీ గౌరవాన్ని కాపాడతా అని చెప్పి రూ.100-150 కోట్ల విలువైన కోకాపేటలో మా అందరికీ ఆత్మగౌరవ భవనాలు ఇచ్చారన్నారు. దాంతోపాటు ఉప్పల్ భగాయత్‌లో ఇచ్చారన్నారు. ఆ తర్వాత మా దగ్గరకు సంఘాలు వచ్చినయి.. మేం సంతోషపడ్డాం. ముఖ్యమంత్రి కూడా కడుపునిండా అన్నం పెట్టి మా గౌరవాన్ని కాపాడిండని మా అదృష్టంగా భావించామన్నారు.

కానీ బీసీ వ్యతిరేకంగా ఉన్న రేవంత్ ప్రభుత్వం చీకటి జీవో 14 ఇవ్వడం జరిగింది. ఇందులో పాత 189 జీవోను రద్దు చేస్తున్నం.. ఇక నుంచి మాదే గుత్తాధిపత్యం.. మళ్లీ మీరు బానిసలుగా బతకండి.. గతంలో మా హయాంలో మీరు బానిసలుగాఉన్నరు.. మళ్లీ మీరు బానిసలుగా ఉండండి.. మీ ఆత్మగౌరవ భవనాలు లేవు.. మేమే ఆధిపత్యం చేస్తమని జీవో నంబర్ 14 ఇవ్వడం జరిగింది. పొన్నం ప్రభాకర్ మీరు బీసీ బిడ్డ. బీసీ సంఘాల్లో తిరిగినం. ఈ జీవో ఇచ్చింది మీకు తెలుసా..? మీ డిపార్ట్‌మెంట్ ఇచ్చింది.. మరి జీవో ఇచ్చినంక కూడా మీరు ఎందుకు పెదాలు మెదపడం లేదని ప్రశ్నించారు.

## గల్లంతైన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిలో 10 మంది క్షేమం

**.. ఒకరి కోసం గాలింపు**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు వద్ద వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి గల్లంతైన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిలో 10 మంది క్షేమంగా బయటపడ్డారు. మరో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు గల్లంతైన ఓ మత్స్యకారుడి ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.బుధవారం ఉదయం చేపల వేట కోసం వలలు కట్టేందుకు ఐదుగురు మత్స్యకారులు బేతుపల్లి చెరువు అలుగు వద్దకు వెళ్లారు. మురసు తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులోకి భారీగా వరద చేరడంతో వారంతా చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న అధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చాతకొండలోని ఆరో బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని సహాయక చర్యలకు పంపించారు. రెండు లైఫ్ బోట్లలో మొత్తం 11 మంది సిబ్బంది వరదలోకి వెళ్లారు. వారు ఐదుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు.అయితే, తిరిగి ఒడ్డుకు చేరుకునే సమయంలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో రెండు బోట్లు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. దీంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది తమ్మిలేరు వాగు వైపు కొట్టుకుపోయారు. తొలుత 11 మంది గల్లంతైనట్లు సమాచారం అందగా.. తాజాగా వారిలో 10 మంది క్షేమంగా బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. మరో ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, రామనగరం ప్రాంతానికి చెందిన మత్స్యకారుడి కోసం గాలిస్తున్నారు.గల్లంతైన మత్స్యకారుడు లైఫ్ జాకెట్ ధరించాడని, అతడు గజ ఈతగాడని సమాచారం. దీంతో అతడిని సురక్షితంగా గుర్తిస్తామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో అజయ్‌కుమార్ సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.

## 'ఓటర్‌కు కనీసం ఓటు వేసే అవకాశం ఇవ్వలేదు'



కడప: పరిషత్ ఎన్నికల నిర్వహణలో సైతం ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి మండిపడ్డారు. మొత్తంగా స్థానిక ఎన్నికల్ని అపహాస్యం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ స్థానిక ఎన్నికల్లో అడుగడుగున యుద్ధం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, చరిత్రలో ఇంత ఘోరంగా ఎప్పుడూ ఎన్నికలు జరగలేదన్నారు. ఎన్నికల్లో కనీసం ఓటరును ఓటు వేసే అవకాశం కూడా ఇవ్వకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేశారన్నారు. పులివెందుల పార్టీ కార్యాలయంలో ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. ' మున్సిపల్ ఎన్నికల తరహాలోనే జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలు.జరిగాయి. పోలీసులే ఎన్నికలు నిర్వహించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు కూటమి ప్రభుత్వానికి ఎన్నికల అధికారులు వత్తాసు పలికారు. మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించారు. పోలింగ్ కేంద్రంలో మా పార్టీ ఏజెంట్లను అనుమతించలేదు. ఇతర ప్రాంతాల నుంచి జనాలను తరలించి ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సైక్లింగ్ చేశారు.

రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఎస్పీకి ఫోన్ చేసి తమ పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని కోరిన పట్టించు కోలేదు. పులివెందులలో జరిగిన అక్రమాలపై ఎస్ఈసీకి పిర్యాదు చేశాం. మా విన్నపం మేరకు ఆ ప్రాంతాల్లో రీపోలింగ్ చేయాలి. ఎస్ఈసీ స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తాం. సీసీ పూటేజీను నిశితంగా పరిశీలించాలి. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడ ఎన్నికల అదికారులు తుంగలో తొక్కారు. మేబు అడిగినట్టు సీసీ ఫూటేజ్ హార్డ్ డిస్క్ ఇస్తే వారి లీలలు బయట పడతాయి. మాకు ప్రజల బలం ఉందనే భయంతో కూటమి పార్టీలు ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడ్డారు' అని ధ్వజమెత్తారు.

## కలలకు రెక్కలు తొడిగి 11 వసంతాలు

**అంతర్జాతీయ ఆవిష్కరణల వేదికగా ఎదిగిన 'టీ-హబ్'**




తెలంగాణను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో కేసీఆర్ హయాంలో అంకురార్పణ జరిగిన 'టీ-హబ్' (విజయవంతంగా 11 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. యువ పారిశ్రామికవేత్తల కలలకు ఊపిరిలూదుతూ, వారి సరికొత్త ఆలోచనలకు సానబెట్టేందుకు ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మక ఇంక్యుబేటర్ నేడు దేశంలోనే అంకుర పరిశ్రమల విప్లవానికి తిరుగులేని ప్రతీకగా నిలిచింది.ఈ 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో టీ-హబ్ 3,300కు పైగా స్టార్టప్‌లకు మార్గదర్శనం చేస్తూ, వాటి విస్తరణకు కీలక తోడ్పాటును అందించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులైన మెంటార్లు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక ప్రముఖులు మరియు గ్లోబల్ మార్కెట్లతో అనుసంధానం కల్పించడం ద్వారా ఔత్సాహిక వ్యవస్థాపకులకు వెన్నుదన్నుగా నిలిచింది. ఫలితంగా ఎన్నో స్టార్టప్‌లు కేవలం ఆలోచన స్థాయి నుంచి విజయవంతమైన వ్యాపార సామ్రాజ్యాలుగా రూపాంతరం చెందాయి.తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ఆకాంక్షలకు, ఆవిష్కరణల స్ఫూర్తికి టీ-హబ్ ప్రస్తుతం దర్పణంగా నిలుస్తోంది. ఇక్కడి అద్భుతమైన ఎకోసిస్టమ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలవడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను ప్రముఖ ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ఆధునిక మౌలిక వసతులు, పరిశోధనలకు అనువైన వాతావరణం కలగలిసి ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థలను, పరిశోధకులను నగరానికి ఆకర్షిస్తున్నాయి.టీ-హబ్ ప్రారంభోత్సవ సమయంలో దిగ్గజ పారిశ్రామికవేత్త దివంగత రతన్ టాటా గారు ప్రశంసిస్తూ.. "టీ-హబ్ ఆధునిక భారతదేశానికి సరికొత్త ముఖచిత్రం" అని కొనియాడారు. ఆయన అన్న మాటలను నిజం చేస్తూ, సరికొత్త ఆలోచనలకు ప్రాణం పోస్తూ, యువతలోని నవకల్పనలకు పదును పెడుతూ టీ-హబ్ తన అద్భుత ప్రస్థానాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తోంది.

## ఇదే రాష్ట్రంలో మళ్ళీ ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్స్ జరుగుతాయి'

కృష్ణాజిల్లా: ప్రస్తుతం అప్రజాస్వామికంలో ఉన్న ప్రజలు.. మళ్లీ ప్రజాస్వామ్యం వర్థిల్లే రోజులు దగ్గర్లోనే చూస్తారని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ స్పష్టం చేశారు. అరచేతిని అడ్డుపెట్టి ఎక్కువ కాలం సూర్యకాంతిని ఆపలేరనేది జగమెరిగిన సత్యమన్నారు వంశీ. 2024 ఎన్నికల్లో ప్రజలను మభ్యెట్టి కూటమి అధికారంలోకి వచ్చిందని, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ఈరోజు(గురువారం, నవంబర్ 5వ తేదీ) గన్నవరం జడ్పీ హైస్కూల్లో పరిషత్ ఎన్నికల ఓటు హక్కు వినియోగించుకున్న వల్లభనేని వంశీ 'సాక్షి'తో మాట్లాడారు. 'ప్రభుత్వం పై ప్రజలు కోపంగా ఉన్నారు చంద్రబాబుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు తేడాగా వస్తాయనే భయం పట్టుకుంది. అందుకే నామినేషన్లు వేయనివ్వలేదు. నామినేషన్లు వేసినవాటిని రిజెక్ట్ చేశారు. డిస్ క్వాలిఫై చేశారు. బూత్ ఏజెంట్లను బయటికి పంపించి .. రిగ్గింగ్ చేసుకున్నారు. ఈ ఎన్నికలు ఎలా జరిగియో చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. సర్వసంఘ పరిత్యాగిని.. నేను పొద్దున్నే రెండు ఇడ్లీలు తింటాను అంటాడు. చేసింది మాత్రం ఏమీ లేదు. ప్రజలెవరూ తమకు ఇవి చేయండని చంద్రబాబు, పవన్ ఇంటి కెళ్లి అడగలేదు .ప్రజల వద్దకు చంద్రబాబే వెళ్లి మరీ హామీలు ఇచ్చారు. సంపద సృష్టిస్తా...మా దగ్గర ఒక విద్య ఉంది.. మనసు ఉంటే మార్గం ఉంటుంది... సంపద సృష్టించి అందరికీ పంచుతాం అన్నారు. ముప్పై నెలల పాలనలో ప్రజల కిచ్చిన వాగ్దానీలేవీ నెరవేర్చ లేదు.

# జాతీయ టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఇనగాల అభినందనలు

**లి హనుమకొండ జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలి**



హనుమకొండ, నవంబర్ 5
జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అభినందించారు. తెలంగాణ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ అంబర్‌పేట్ జీహెచ్ఎంసీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన 10వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్-2026లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.
స్టేట్ టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్, హనుమకొండ జిల్లా కార్యదర్శి అల్వాల రాజ్ కుమార్, ఉమ్మడి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ట్రెజరర్ ఎండీ జహూర్ ఆధ్వర్యంలో క్రీడాకారులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నెల 17 నుంచి 21 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

**జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు వీరే..**

బాలికల విభాగంలో పరకాల్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కళాశాలకు చెందిన జి. నవ్య (5వ స్థానం), చిట్యాల కళాశాలకు చెందిన బి. జ్యోతి (6వ స్థానం), ఎల్కతుర్తి కళాశాలకు చెందిన పి. ప్రవీణ (7వ స్థానం), హసన్‌పర్తి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన టి. అక్షయ (8వ స్థానం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.
బాలుర విభాగంలో నర్సంపేట సైనిక్ స్కూల్‌కు చెందిన ఎం. యశ్వంత్ (1వ స్థానం), కరుణాపురం ఎంజేపీ విద్యాలయానికి చెందిన డి. వంశీకృష్ణ (2వ స్థానం), ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన డి. సాయినాథ్ (3వ స్థానం), కరుణాపురం ఎంజేపీ విద్యాలయానికి చెందిన ఎ. పునీత్ కుమార్ (4వ స్థానం), ఏటూరునాగారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన జి. ఆకాష్ (5వ స్థానం), జకారం సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన జె. శ్రవణ్ (6వ స్థానం), ఏటూరునాగారం పాఠశాలకు చెందిన ఎ. సాంబశివరావు (7వ స్థానం) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
ఈ సందర్భంగా క్రీడాకారుల మెరిట్ సర్టిఫికెట్లను పరిశీలించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం హనుమకొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లోనూ విజయం సాధించి రాష్ట్ర కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు.
క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐక్యతకు ప్రతీకగా పద్మశాలీల కార్తీకమాస వనభోజన మహోత్సవం

**మార్కండేయుని ధర్మమార్గం సమాజానికి ఆదర్శం.. ఆత్మగౌరవం, ఐక్యతతో ముందుకు సాగాలి -- ఈగ మల్లేశం**
**నవంబర్ 29న హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్ట వద్ద మహోత్సవం.. పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఈగ మల్లేశం**



హన్మకొండ, నవంబర్ 5: పద్మశాలి సమాజ ఐక్యత, ఆత్మీయత, సంస్కృతి సంప్రదాయా లను చాటిచెప్పేలా నిర్వహించనున్న పద్మశాలీల కార్తీకమాస వనభోజన మహోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆవిష్కరించారు. తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
హసన్‌పర్తిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఎర్రగట్టుగుట్ట వద్ద నవంబర్ 29వ తేదీ ఆదివారం ఉదయం ఈ వనభోజన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న పద్మశాలి కులబాంధవులు, మహిళలు, యువతీ యువకులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈగ మల్లేశం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. శ్రీ మార్కండేయ స్వామి జీవితం మానవాళికి ఆదర్శప్రాయమని, ఆయన అచంచలమైన శివభక్తి, పట్టుదల, ఆత్మవిశ్వాసం మృత్యువునే జయించేలా చేశాయని పేర్కొన్నారు. భక్తి, ధర్మనిష్ఠతో చిరంజీవిగా నిలిచిన మార్కండేయుని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మార్కండేయ స్వామి చూపిన భక్తి, ధర్మమార్గంలో పయనిస్తూ, కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. పద్మశాలీల కార్తీకమాస వనభోజన మహోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, సమాజ బంధాలను బలోపేతం చేసే ఆత్మీయ కలయిక అని ఆయన అన్నారు. కులబాంధవుల మధ్య ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించే గొప్ప వేదికగా ఈ మహోత్సవం నిలుస్తుందని తెలిపారు. మన ఆరాధ్య దైవమైన శ్రీ మార్కండేయ స్వామి ఆశీస్సులతో సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, పద్మశాలి సమాజ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పద్మశాలీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, వైద్యం రాజగోపాల్, రాష్ట్ర కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, రాష్ట్ర కార్యదర్శి వెంగళ వేణుగోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు బొప్ప శంకర్, గుర్రపు కోటేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కేదాసి వెంకటేశ్వర్లు, దిడ్డి రమేష్, పాము శ్రీనివాస్, గుర్రపు చంద్రశేఖర్, ధూంపేట నరేందర్, గజ్జెల అమరేందర్, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

# క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీ

**తొలిసారిగా 701--710 ర్యాంక్ బ్యాండ్‌లో చోటు**
**దేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానం**
**తెలుగు రాష్ట్రాల ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానం**
**సాధించామన్న ఛాన్సలర్ వరదారెడ్డి**

వరంగల్, నవంబర్ 5
వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీ క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్--2027లో తొలిసారిగా స్థానం సాధించినట్లు యూనివర్సిటీ ఛాన్సలర్ ఏ. వరదారెడ్డి తెలిపారు. ఆసియా స్థాయిలో 701--710 ర్యాంక్ బ్యాండ్‌లో నిలిచినట్లు వెల్లడించారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానం, తెలుగు రాష్ట్రాల్లోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానం సాధించినట్లు పేర్కొన్నారు.
విలేకరుల సమావేశంలో వరదారెడ్డి మాట్లాడుతూ, క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా ప్రవేశించి ఈ గుర్తింపు పొందడం యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రస్థానంలో ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. విద్యా ప్రమాణాలు, పరిశోధనా సామర్థ్యం, అంతర్జాతీయ భాగస్వామ్యాల బలోపేతానికి చేస్తున్న కృషికి ఈ ఫలితం ప్రోత్సాహకరమని అన్నారు.

**విద్యా, పరిశోధన ప్రమాణాలకు గుర్తింపు**
క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో విద్యాసంస్థల అకడమిక్ ప్రతిష్ఠ, ఉద్యోగదాతల అభిప్రాయాలు, పరిశోధన పనితీరు, అధ్యాపకులు--విద్యార్థుల నిష్పత్తి, అంతర్జాతీయ పరిశోధనా నెట్‌వర్క్‌లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని వరదారెడ్డి వివరించారు. ఈ ప్రమాణాల ఆధారంగా యూనివర్సిటీకి స్థానం లభించడం సంతోషకరమన్నారు.
ఈ విజయానికి కృషి చేసిన యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ఆయన అభినందించారు. నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యాసంస్థగా ఎస్ఆర్ యూనివర్సిటీని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్--2027, యూఐ గ్రీన్‌మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లోనూ గుర్తింపు పొందినట్లు పేర్కొన్నారు.

**ఆవిష్కరణలు.. ఉపాధి అవకాశాలపై దృష్టి**
వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, విద్యా ప్రమాణాల మెరుగుదల, నాణ్యమైన పరిశోధనలు, అంతర్జాతీయ



సహకారాలు, పరిశ్రమలతో అనుసంధానానికి ఇస్తున్న ప్రాధాన్యమే ఈ విజయాలకు కారణమని తెలిపారు. అంతరశాఖా విద్య, అనుభవపూర్వక బోధన, పరిశోధన ఆధారిత ఆవిష్కరణలతో పాటు విద్యార్థుల ఉపాధి అవకాశాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.
అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషితోనే ఈ గుర్తింపులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ప్రపంచ అవసరాలకు అనుగుణమైన విద్య, పరిశోధనల ద్వారా వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.
విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ఏ. వరదారెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

**మద్దతు ధరకు ప్రతి గింజను కొనుగోలు చేయాలి**
**తరుగు పేరుతో అనవసర కోతలకు తావివ్వొద్దు**
**ఆరు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర**



భూపాలపల్లి, నవంబర్ 5
రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గురువారం భూపాలపల్లి రూరల్ మండలంలోని నాగారం, దీక్షకుంట, ఆజం నగర్, పంబాపూర్, కమలాపూర్, నందిగామ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీరు, తేమ కొలిచే యంత్రాలు, గోనె సంచులు, తూకం యంత్రాలు, రవాణా సదుపాయాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టాలి**
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యతని ఎమ్మెల్యే అన్నారు. ఐకేపీ, పీఏసీఎస్ తదితర కేంద్రాల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోళ్లలో అక్రమాలకు, తరుగు పేరుతో అనవసర కోతలకు తావివ్వొద్దని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**రైతు సంక్షేమానికి ప్రాధాన్యం**
రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గండ్ర పేర్కొన్నారు. పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు రైతు భరోసా ద్వారా అర్హులకు ఆర్థిక సాయం అందిస్తోందని, రుణభారాన్ని తగ్గించేందుకు రుణమాఫీ అమలు చేసిందని తెలిపారు. ఉచిత విద్యుత్, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు బీమా ద్వారా రైతు కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని చెప్పారు.

**సకాలంలో చెల్లింపులు జరగాలి**
ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, సమస్యలు ఎదురైతే అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.
రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీసీఓ, డీఎస్ఓ, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం

**మల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



హసన్‌పర్తి, నవంబర్ 5
పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.
హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారు పున్నం మురళి--రజిత నిర్మించుకున్న నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు.
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు ఆర్థిక సహాయం అందించి వారి సొంతింటి కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, ఆత్మగౌరవానికి, భద్రతకు, భవిష్యత్తుకు ప్రతీక అని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, పేదల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ గాజు కృష్ణవేణి యుగేందర్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, డైరెక్టర్లు రత్నాకర్, ఐలి గౌడ్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు గట్ల సాంబయ్య, జిల్లా యువజన నాయకుడు జెట్టి యుగేందర్, అర్వపల్లి సర్పంచ్ ప్రభాకర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

## అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించాలి -- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్


**వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డికి ఘన సన్మానం**
**రైతుల సంక్షేమం, సహకార రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి -- అయూబ్**

**- వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ.**

**- మండల, డివిజన్ స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని పిలుపు.**

**- అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి.**

**- వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్బిడి రాజిరెడ్డికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి అభినందనలు, సత్కారం.**



వరంగల్, నవంబర్ 5

వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పిలుపునిచ్చారు.ఈ మేరకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమని పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించాలని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టి బాధ్యతతో పనిచేసి నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డికి ఘన సన్మానం

వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా ఇటీవల నియమితులైన అబ్బిడి రాజిరెడ్డి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పార్టీ మండల, డివిజన్ అధ్యక్షుల సమక్షంలో రాజిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాజిరెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమని అన్నారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, సహకార రంగ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు. ఈ పదవి ఆయనకు మరిన్ని ప్రజాసేవా అవకాశాలను కల్పించాలని అభినందనలు తెలిపారు.ఈ రెండు కార్యక్రమాల్లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మండల అధ్యక్షులు పొశాల వెంకన్న, ఇస్లావత్ సావిత్రి, దాడి శివ, ఇంద్ల రవికుమార్, డివిజన్ అధ్యక్షులు జన్ను అరుణాకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజ్‌కుమార్, అశోక్, మహమ్మద్ జానీ, పసునూరి శ్రవణ్, కాంగ్రెస్ నాయకులు మన్నె బాబురావు, ఎల్గొండ ప్రవీణ్, గోదాసి చిన్న, కిన్నెర రవి, మంద సన్నీ, షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ ట్యాక్స్‌పై చర్యలేవి?

హైదరాబాద్, నవంబర్ 5హైదరాబాద్‌లో నిర్మాణ రంగాన్ని పట్టిపీడిస్తున్న రాహుల్, రేవంత్ (ఆర్ఆర్) ట్యాక్స్ వాస్తవమేనని, నగరంలోని ఏ బిల్డర్, డెవలపర్‌ను అడిగినా ఈ విషయం స్పష్టం చేస్తారని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో నిర్మాణంలో ఉన్న భవనాల యజమానుల నుంచి చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారనేది వాస్తవమని స్పష్టంచేశారు. ఈ వ్యవహారంపై ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పలుమార్లు హైదరాబాద్‌కు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసినా, ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గురువారం ఎక్స్ వేదికగా విమర్శించారు.ఇంతటి తీవ్రమైన అవినీతి జరుగుతున్నదని స్వయంగా ఆరోపిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ పెద్దపెద్ద మాటలు చెప్పడం, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తప్ప, ఆ ఆరోపణలపై విచారణ జరిపించడం కానీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడం కానీ ఎందుకు లేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డిని తన ఏబీవీపీ రోజుల నాటి చోటేభాయ్‌గా అభివర్ణిస్తూ, బడే భాయ్ మోదీ ఆయనపై ఎప్పటికీ చర్యలు తీసుకోరని ఎద్దేవాచేశారు.బీజేపీ నేతల విమర్శలు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితమవుతున్నాయని, మాటల్లో అవినీతిని ప్రశ్నిస్తున్నా చేతల్లో కనిపించడం లేదని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న అంతర్గత అవగాహనే ఈ వ్యవహారంపై చర్యలు లేకపోవడానికి కారణమని ఆరోపించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని నిలదీశారు

# అలుపెరుగని పోరాటయోధుడు నల్ల నర్సింహులు

వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యకులు చకిలం ఉపేందర్‌హన్మకొండ నారద నవంబర్ 5

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో టైగర్ నల్లా నర్సింహులు అలుపెరుగని పోరాట యోధుడని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం వరంగల్ హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ల అధ్వర్యంలో చకిలం ఉపేందర్ అధ్యక్షతన గురువారం జరిగిన తెలంగాణ టైగర్ నల్లా నర్సింహులు 33వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ తరం ప్రజలు వారి స్ఫూర్తిని పొంది ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్ మాట్లాడుతూ నల్లా నర్సింహులు నిరంకుశ విస్నూరు దొరను, భూస్వామ్యుల ఆగడాలను ఎదిరించి ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని, వారితో తనకు గల సహచర్యాన్ని అనుభవాలను పంచుకున్నారు. తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వీర వెంకట రత్నం మాట్లాడుతూ నల్లా నర్సింహులు జీవిత చరిత్ర చదివి ప్రేరణ పొందానని నల్ల నర్సింహులు తీవ్ర నిర్బంధంలో కూడా తను నమ్మిన ఆశయాలకోసం పోరాడారని, తెలంగాణ పేద రైతులకోసం ఉరికొయ్యలను కూడా ఎదిరించి పోరాడిన చరిత్ర వారిదని, యువతరం తెలంగాణ పోరాటయోధులను మరువరాదని అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ నల్లా నరసింహులు భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తికోసం పోరాడారని, ఆయన పోరాట స్ఫూర్తిని పొంది బహుజనుల హక్కుల కోసం ఐక్య పోరాటం



చేయాలని అన్నారు.
వరంగల్ బార్ మాజీ అధ్యక్షులు వలుస సుధీర్ మాట్లాడుతూ నల్ల నర్సింహులుకు అనాటి పాలకులు మూడుసార్లు ఉరిశిక్ష విధించబడినప్పటికీ ఆయన ధైర్యం కోల్పోలేదని, న్యాయస్థానాల్లో సైతం ధైర్యంగా తన వాదనలు వినిపించారని ఆయన ధైర్యసాహసాలను చూసి పోలీసు అధికారులు సైతం ఆశ్చర్యపోయేవారని అంటూ ఆయన భార్య వజ్రమ్మ త్యాగం కూడా అనన్యమైనదని, నల్లా నరసింహులు భార్య వజ్రమ్మ కూడా పోరాట జీవితంలో అనేక కష్టాలను ఎదుర్కొన్నారని భర్త ఉద్యమంలో ఉన్న సమయంలో ఆమెను కూడా అరెస్టు చేసి జైలులో ఉంచారని, జైలులో ఉన్నప్పుడే ఆమె ఒక ఆడశిశువుకు జన్మనిచ్చినట్లు తెలియజేస్తూ పీడిత ప్రజల విముక్తి కోసం నల్లా నర్సింహులు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత పోరాట యోధుడని అలాంటి మహానీయుల నుండి బహుజన సమాజం స్ఫూర్తి పొంది అసమానతలను ప్రశ్నించే చైతన్యాన్ని సాధించి ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ లు తమ హక్కులకోసం ఏకమై ఐక్య ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మరుగునపడిన నల్ల నర్సింహులు చరిత్రను భావితరాలకు అందించాలని తన వయసును లెక్కచేయకుండా అవిరామంగా కృషి చేస్తున్న సామాజిక వేత్త పెద్దలు దాసరి జనార్ధన్ ను వరంగల్ బార్ అధ్యక్షులు చకిలం ఉపేందర్ శాలువతో సత్కరించారు.

ఈ సమావేశంలో ఇరు బార్ అసోసియేషన్ల కార్యదర్శులు ఆర్ నాగేంద్ర చారి, ఊరుగొండ నరేందర్, ఉపాధ్యక్షురాలు వి లలితకుమారి, రఘుపతి, సంయుక్త కార్యదర్శి ఆడెపు సునిల్, సీనియర్ న్యాయవాదులు దాసరి ప్రేమ్ సాగర్, సాయిని నరేందర్, చిల్లా రాజేంద్ర ప్రసాద్, విలాసాగరం సురేందర్ గౌడ్, నీలా శ్రీధర్, సిద్ధు నాయక్, నర్సింగరావు, జన్ను పద్మ, నర్సింగ్, గంజి రమేష్, రాచకట్ల కృష్ణ, జగదీష్, పాము శరత్ నల్ల మహాత్మ, గురిమిల్ల రాజు తదితర న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ భవనాలపై చీకటి జీవో..

**బీసీలను అణచి వేసేందుకే జీవో 14**

- బీసీలను అణచి వేసేందుకే జీవో 14
- సర్కార్ నిర్ణయం బీసీలకు శరాఘాతం
- ఆ జీవో రద్దుచేసేదాకా బీఆర్ఎస్ పోరు
- సమైక్యవాదుల కనుసన్నల్లో రేవంత్ పాలన
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి




హైదరాబాద్, నవంబర్ 5 ‘బీసీలపై వ్యతిరేకతతోనే ఆత్మగౌరవ భవనాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి జీవో-14 తెచ్చింది. ఆ భవనాలపై సర్కార్ పెత్తనం చేసేందుకు కుట్రలు చేస్తున్నది’ అని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ సంక్షేమ శాఖ నుంచే ఈ చీకటి జీవో రావడం, ఆ శాఖ మంత్రి అయిన బీసీ బిడ్డ పొన్నం మౌనం వహించడం దుర్మార్గమని ఖండించారు.

నాడు బీసీల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసేందుకు బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నగరం నడిబొడ్డున తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వేల కోట్ల విలువైన స్థలాలను ఇచ్చారని కొనియాడారు. కానీ ఆ భవన నిర్మాణాలకు నిధులివ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం పెత్తనం సాగించాలని చూడటం శోచనీయమని పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే జీవో 14 రద్దు చేసేదాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. సమైక్య పాలనలో కంటే రేవంత్ హయాంలోనే తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సమైక్యవాదుల కనుసన్నల్లోనే రేవంత్ ప్రభుత్వం నడుపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలో రాష్ట్రంలో చేతగాని సర్వభ్రష్ట ప్రభుత్వం కొనసాగుతున్నదని నిప్పులు చెరిగారు.

**కిరణ్‌కుమార్‌రెడ్డిలాగా రేవంత్ అవహేళన: గంగుల**

‘బీసీల ఆత్మగౌరవంపై రేవంత్ ప్రభుత్వం దాడి చేస్తున్నది. ఇందులో భాగంగానే జీవో 14ను జారీచేసింది’ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ భవనాలకు స్థలాలివ్వమంటే అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వెకిలిగా నవ్వి అవహేళన చేశారని, ఇప్పుడు సీఎం రేవంత్ సైతం అదేవిధంగా వ్యవహరిస్తూ బీసీలను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు.41 బీసీ కులాల ఆత్మగౌరవ భవనాలకు రూ.4 వేల కోట్ల విలువైన స్థలాలతో పాటు రూ.97.5కోట్లు కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. ఇందులో భాగంగా జీవో-189 ఇచ్చి బలహీనవర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించారని ప్రశంసించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనవర్గాల హక్కులను కాలరాస్తున్నదని దుయ్యబట్టారు. వెంటనే జీవో 14 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేదంటే త్వరలోనే చలో కోకాపేట కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

**కత్తి రేవంత్‌ది.. పొడిచేది పొన్నం ప్రభాకర్: ఎమ్మెల్సీ దాసోజు**

బీసీలపై కాంగ్రెస్ సర్కార్ కర్రపెత్తనం సాగించేందుకు యత్నిస్తున్నదని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ ధ్వజమెత్తారు. మనదేశం కులాల సమాహారం అని చెప్పిన మారోజు వీరన్న స్ఫూర్తితో కేసీఆర్ బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.4 వేల కోట్ల విలువైన స్థలాలిచ్చారని గుర్తుచేశారు. కానీ బలహీనవర్గాల అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకే రేవంత్‌రెడ్డి జీవో-14 జారీచేశారని ఆరోపించారు. కత్తి రేవంత్‌రెడ్డిదైతే పొడిచేది మాత్రం బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ అని నిప్పులు చెరిగారు.

బీసీల ఆత్మగౌరవ నిర్మాణానికి నియమించిన సెలక్షన్ కమిటీలో ఒక్క బీసీ బిడ్డకు చోటు దక్కలేదని, ఈ వ్యవహారం సర్కార్ నిబద్ధతకు అద్దం పడుతున్నదని విమర్శించారు. ఆత్మగౌరవ భవనాల్లో రాజకీయ సమావేశాలు పెట్టుకోవద్దని ప్రభుత్వం హుకుం జారీ చేయడం, బీసీ కమిటీలను రద్దుచేసే అధికారాన్ని పొందడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. బీసీ వ్యతిరేక సర్కార్ తీరుకు నిరసనగా జీవో 14 కాపీలను చింపివేశారు. ఈ చీకటి ఉత్తర్వులు రద్దుచేయకుంటే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఆత్మగౌరవ స్థలాలపై రేవంత్ కన్ను: విప్ వివేకానంద**

సీఎంగా రేవంత్‌రెడ్డి గద్దెనెక్కినప్పటి నుంచి కనపడ్డ భూములను కొల్లగొట్టడమే పనిగా పెట్టుకున్నారని విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద ఆరోపించారు. బీసీ ఆత్మగౌరవ భవనాలకు కేసీఆర్ కేటాయించిన స్థలాలను అమ్ముకొనేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. భూములు అమ్ముతూ ఢిల్లీకి మూటలు మోస్తున్న ముఖ్యమంత్రి.. బలహీనవర్గాలను మోసం చేసేందుకే ఈ కుటిల పన్నాగం పన్నారని ధ్వజమెత్తారు. వెంటనే చీకటి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు!




దేశీ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. 2 వేల పాయింట్ల లాభంతో సెన్సెక్స్ ముగియగా నిఫ్టీ 24,500 మార్కును దాటింది. బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఫైనాన్షియల్, రియల్టీ రంగాల షేర్లు లాభాలతో ముగిశాయి. యూఎస్ మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఏర్పడిన సానుకూల వాతావరణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు తొలగుతాయన్న ఆశలు, దేశంలోకి పెరిగిన విదేశీ పెట్టుబడులు, కార్పొరేట్ లాభాలు తదితర పరిణామాలు మార్కెట్‌లో జోష్ నింపాయి.

నేడు సెన్సెక్స్ 2,008.21 పాయింట్ల లాభంతో 79,310 వద్ద ముగిసింది. 78,710 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ ఇంట్రాడేలో 79,470.03 గరిష్ఠాన్ని తాకింది. క్రితం ముగింపుతో పోలిస్తే 2.60 శాతం మేర ఎగబాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50,576 పాయింట్ల లాభంతో 24,536.60 వద్ద ముగిసింది. క్రితం ముగింపుతో పోలిస్తే 2.40 శాతం మేర లాభపడింది. ఇన్‌ట్రాడేలో 24,579.05 వద్ద గరిష్ఠాన్ని తాకింది.

బ్యాంకింగ్, ఆటో రంగాల ర్యాలీ..

సెన్సెక్స్‌లో కీలకమైన బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లు కొనుగోళ్లు నేడు జోరందుకున్నాయి. సెనెన్స్‌లో బజాజ్ ఫైనాన్స్ టాప్ గెయినర్‌గా (7.7 శాతం) నిలిచింది. ఇండిగో షేర్లు కూడా 5.80 శాతం మేర లాభపడ్డాయి. ఇక వివిధ రంగాల్లో పరిస్థితి అద్దం పట్టే సెక్టోరల్ సూచీలు కూడా లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 4.24 శాతం లాభంతో టాప్‌లో నిలిచింది.

అంతర్జాతీయ పరిణామాలు నేడు మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపించాయని పరిశీలకులు చెబుతున్నారు. మిడ్‌టర్మ్ ఫలితాల నేపథ్యంలో ఇరాన్ యుద్ధం, వాణిజ్య విధానాల విషయంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెత్తబడతారన్న అంచనాలు సానుకూల సంకేతాలిచ్చాయి. ఈ నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు కూడా కాస్త శాంతించాయి.

# కొత్త ఉద్యోగం : రోజంతా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తే డబ్బు!




రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న 'ఇన్‌ఫ్లూయిష్' సంస్థ, దీపావళి సందర్భంగా ఒక విచిత్రమైన, ఆసక్తికరమైన ఉద్యోగ ప్రకటనతో వార్తల్లో నిలిచింది. రోజంతా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తూ, ఆ ప్లాట్‌ఫామ్‌లో ట్రెండింగ్‌లో , వైరల్ అవుతున్న వాటిపై రిపోర్ట్ చేసే సామర్థ్యం ఉన్న వ్యక్తి కోసం ఈ సంస్థ వెతుకుతోంది. ఈ ఉద్యోగాన్ని వివరిస్తూ, ఆసక్తిగల అభ్యర్థులు ఎలా దరఖాస్తు చేసుకోవచ్చో తెలియజేస్తూ, ఆ సంస్థ ఉద్యోగులు సోషల్ మీడియాలో ఒక వీడియోను పంచుకోవడం నెట్టింట వైరల్‌గా మారింది. అయితే ఇక్కట ఇంకో ట్విస్ట్ ఉంది.

ఈ వినూత్న ఉద్యోగం పేరే 'డూమ్‌స్క్రోలర్'డూమ్‌స్క్రోలర్‌గా చేయాల్సిందల్లా...రోజంతా ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూస్తూ, ఏవి ట్రెండ్ అవుతున్నాయి, ఏవి వైరల్ అవుతున్నాయి అనే విషయాన్ని రిపోర్ట్ చేయాలన్నమాట. ఆ వీడియోలో ఒక వ్యక్తి మాట్లాడే శైలి అందరినీ ఆకట్టుకుంటోంది. "మీకు నిజంగా ఇన్‌స్టాగ్రామ్ వాడటం బాగా ఇష్టమైతే, దానికే మేము మీకు జీతం ఇస్తాం. రోజంతా ప్రశాంతంగా కూర్చుని రీల్స్ స్క్రోల్ చేస్తూ... ఇన్‌స్టాగ్రామ్‌లో ఏవి వైరల్ అవుతున్నాయో అందరికీ చెప్పే ఒక మంచి 'డూమ్‌స్క్రోలర్' మాకు కావాలోయ్!" అని పేర్కొన్నారు. ఫుల్ టైమ్ ఉ ఇంటర్న్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఉద్యోగంపై ఆసక్తి ఉన్నవారు సదరు వీడియో కింద 'ఎఱ' అని కామెంట్ చేయాలని కోరారు. ఉదయ్‌పూర్‌లో ఉండే అభ్యర్థులకు డైరెక్ట్ మెసేజ్ (ణవీ) ద్వారా అప్లికేషన్ లింక్‌ను పంపుతామని తెలిపారు. అంటే ఉదయ్‌పూర్ వాసులకే ఈ ఉద్యోగం సొంతం. అదన్నమాట ట్విస్ట్.ఉ

# బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు..

### గులాబీ గూటికి నిర్మల్ యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో నల్ల వినయ్ రెడ్డికి, ఆయన కుటుంబానికి మంచి గుర్తింపు ఉంది. మాజీ సమితి ప్రెసిడెంట్ భీమిరెడ్డి మనవడిగా వినయ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉండటంతో పాటు, స్థానికంగా వారి కుటుంబానికి బలమైన పరిచయాలు, ప్రజల్లో ఆదరణ ఉన్నాయి. యువ నాయకుడిగా వినయ్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం నిర్మల్ జిల్లాలో పార్టీకి మరింత బలం చేకూర్చనుంది.

# రాహుల్ మద్యం వ్యాఖ్యలు.. 'పప్పు' అంటూ ఆప్ కౌంటర్

చండీగఢ్, నవంబర్ 5: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య రాజకీయ పోరు రసవత్తరంగా మారింది. ఎన్నికలకు కొన్ని నెలల సమయం ఉండగానే ఆ రెండు పార్టీల నేతల వ్యక్తిగత విమర్శలు తారాస్థాయికి చేరాయి. ముఖ్యంగా పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన మద్యం వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపగా.. ఆప్ సైతం రాహుల్‌ను 'పప్పు' అని ఎద్దేవా చేస్తూ ఎదురుదాడికి దిగింది.

రాహుల్ మద్యం వ్యాఖ్యలు..

పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఈ నెల 4న నిర్వహించిన 'ఇన్సాఫ్ ర్యాలీ'లో కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో మాన్ ఎంపీగా ఉన్నప్పుడు లోక్‌సభలో తనతో కలిసి కూర్చునేవారని ఆయన తెలిపారు. అయితే, ఉదయం 11 గంటలకే మాన్ నుంచి మద్యం వాసన వచ్చేదని రాహుల్ ఆరోపించారు. మద్యం సేవించడం ఆయన వ్యక్తిగత విషయమని చెబుతూనే.. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యను అరికట్టాల్సిన ముఖ్యమంత్రి ప్రతిరోజూ మత్తులో ఉంటే ఆ సమస్యను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. పంజాబ్‌లో డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని ఆప్ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అయితే, రాష్ట్రంలో ఏ ప్రాంతంలో డ్రగ్స్ సమస్య పూర్తిగా తగ్గిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పంజాబ్ ప్రభుత్వాన్ని ఢిల్లీ నుంచి అరవింద్ కేజ్రీవాల్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నియంత్రిస్తున్నారంటూ విమర్శించారు. రాష్ట్ర పాలనపై పంజాబ్ నాయకులకే పూర్తి అధికారం ఉండాలని వ్యాఖ్యానించారు.

'పప్పు' అంటూ ఆప్ ఎదురుదాడి..

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు ఆప్ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. ఆయన్ని ఉద్దేశించి 'పప్పు' అనే పేరుతో ఎద్దేవా చేసింది. ఈ మేరకు 2017లో గుజరాత్‌లో రాహుల్ ప్రసంగానికి సంబంధించిన వ్యాఖ్యను జత చేసింది. అందులో బంగాళాదుంపలు




వేస్తే బంగారం వస్తుందని రాహుల్ చెబుతున్నట్లుగా ఉంది. అలాగే ఆయన గతంలో చేసిన వ్యాఖ్యల్లో తమకు నచ్చిన జోక్ ఏదో చెప్పాలంటూ నెటిజన్లను ఆప్ కోరింది. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలను ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ తప్పుబట్టారు. జాతీయ స్థాయి నాయకుడు ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగడం తగదని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీనా? లేక ప్రతిపక్ష పార్టీలేనా? అని ప్రశ్నించారు.

# మహిళ కిడ్నాప్ డ్రామా.. వెలుగులోకి బంగారం స్మగ్లింగ్ వ్యవహారం..

కేరళం, నవంబర్ 5: దుబాయ్ నుంచి తీసుకొచ్చిన బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ ఓ మహిళ అడ్డంగా బుక్కైంది. బంగారాన్ని అప్పగించాల్సిన వ్యక్తికి ఇవ్వకుండా తానే కాజేయాలని ఆమె వేసిన కిడ్నాప్ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. దాదాపు 12 కిలోమీటర్ల పాటు సినిమా రేంజ్ ఛేజింగ్ చేసిన పోలీసులు.. నిందితురాలితో పాటు పలువురిని అరెస్టు చేశారు. అయితే, మహిళ వేసిన ప్లాన్ చూసి పోలీసులే కంగుతిన్నారు. వెంటనే అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించారు. ఈ ఘటన కేరళంలోని కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో చోటుచేసుకుంది.తలస్సేరికి చెందిన ప్రియాంక అనే మహిళ దుబాయ్ నుంచి సుమారు 18 సవర్ల బంగారంతో కేరళంలోని కరిపూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. ఆ బంగారాన్ని విమానాశ్రయం బయట వేచి ఉన్న మట్టన్నూర్‌కు చెందిన జబీర్ అనే వ్యక్తికి అప్పగించాల్సి ఉంది. అయితే, బంగారాన్ని అతనికి ఇవ్వకుండా తానే కాజేయాలని ప్రియాంక ప్లాన్ వేసింది. ఈ మేరకు కన్నూర్‌కు చెందిన శ్రీలాల్, ప్రిన్స్, సుభిత్ అనే ముగ్గురితో చేతులు కలిపింది. జబీర్‌కు బంగారాన్ని ఇవ్వడానికి ముందే తనను ఎవరో కిడ్నాప్ చేసినట్లు నాటకానికి తెరతీసింది



నిందితురాలు.ఇందులో భాగంగా ప్రియాంకను తీసుకెళ్లేందుకు శ్రీలాల్ ఓ కారుతో విమానాశ్రయానికి వచ్చాడు. ఈ సందర్భంగా కిడ్నాప్ పథకాన్ని అమలు చేశారు. ప్రియాంకను ఎవరో తీసుకెళ్తున్నట్లు గుర్తించిన జబీర్ ఆ కారు వెంబడి పరిగెత్తాడు. ఇది కరిపూర్ విమానాశ్రయ పోలీస్ స్టేషన్ అధికారి గమనించారు. కిడ్నాప్ జరుగుతోందని అనుమానించిన ఆయన వెంటనే పోలీసు వాహనంతో కారును వెంబడించారు. దాదాపు 12 కిలోమీటర్ల పాటు ఛేజ్ చేసి కారును నిలువరించారు. అందులో ఉన్నవారిని సురక్షితంగా కాపాడారు.అయితే, ప్రియాంక పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో అసలు విషయం బయటపడింది. అక్రమ బంగారాన్ని కాజేసేందుకు తానే ప్లాన్ వేసినట్లు ప్రియాంక అంగీకరించింది. దీంతో ప్రియాంక, ఆమెకు సహకరించిన ముగ్గురు సహా జబీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, ఈ కుట్రతో ప్రియాంక భర్తకు ఎలాంటి సంబంధం లేదని తేల్చారు.

భర్త, పిల్లలను తీసుకురావడం ద్వారా కిడ్నాప్ వ్యవహారం సహజంగా కనిపించేలా ప్రియాంక ప్లాన్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ బంగారం స్మగ్లింగ్ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు, కస్టమ్స్ సిబ్బందికి ఏమైనా సంబంధాలున్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం: మల్కాజ్‌గిరి సీపీ సుమతి

హైదరాబాద్, నవంబర్ 05: అక్రమ ఫైనాన్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి స్పష్టం చేశారు. అక్రమ ఫైనాన్స్, అధిక వడ్డీలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ ఫైనాన్స్, రుణాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన నలుగురు నిందితులను ఎస్ఓటీ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, 12 మొబైల్ ఫోన్లతోపాటు 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీ చెక్కులు, రెండు సేల్ డీడ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రూ.47,690 నగదు, రెండు పట్టాదారు పాస్ పుస్తకాలు సీజ్ చేశామని వివరించారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని వివరించారు. అక్టోబర్ 26వ తేదీన ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. తాజా అరెస్టులతో నిందితుల సంఖ్య ఏడుకి పెరిగిందని చెప్పారు.నిందితులపై ఎల్బీనగర్, నేరేడ్‌మెట్, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు కేసుల నమోదయ్యాయని సీపీ సుమతి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులే ఈ ముఠా లక్ష్యమని తెలిపారు. పరిచయస్తులు, మధ్యవర్తుల ద్వారా బాధితులకు వల వేస్తారని వివరించారు. భారీ మొత్తంలో రుణాలు ఇప్పిస్తామంటూ నమ్మించి ముందస్తు వడ్డీ పేరుతో భారీగా నగదు వసూళ్లు చేస్తారని చెప్పారు. హామీ ఇచ్చిన రుణం మొత్తం ఇవ్వకుండా కొంత మొత్తమే చెల్లించి అదనపు నగదు వసూళ్లు చేస్తారని పేర్కొన్నారు.

అసలు రుణం కంటే అధిక మొత్తానికి ప్రామిసరీ నోట్లు, బాండ్లు, ఖాళీ చెక్కులపై నిందితులు సంతకాలు తీసుకున్నారని వివరించారు. అప్పు చెల్లించినా పత్రాలు తిరిగి ఇవ్వకుండా అదనపు నగదు కోసం వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. డబ్బులు ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు,




భౌతిక దాడులు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ఏఐ ఆధారిత క్యాన్సర్ గుర్తింపు యంత్రం కొనుగోలు చేయాలనుకున్న వృద్ధురాలైన మహిళా వైద్యురాలిని కూడా ఈ ముఠా మోసం చేసిందని మల్కాజ్‌గిరి సీపీ సుమతి వివరించారు. వైద్యురాలికి చెందిన స్కోడా, టయోటా ఇన్నోవా హైక్రాస్ కార్లను బలవంతంగా ఈ ముఠా స్వాధీనం చేసుకుందని తెలిపారు.

# కలలకు రెక్కలు తొడిగి 11 వసంతాలు

తెలంగాణను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో కేసీఆర్ హయాంలో అంకురార్పణ జరిగిన 'టీ-హబ్'విజయవంతంగా 11 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. యువ పారిశ్రామికవేత్తల కలలకు ఊపిరిలూదుతూ, వారి సరికొత్త ఆలోచనలకు సానబెట్టేందుకు ప్రారంభమైన ఈ ప్రతిష్టాత్మక ఇంక్యుబేటర్ నేడు దేశంలోనే అంకుర పరిశ్రమల విప్లవానికి తిరుగులేని ప్రతీకగా నిలిచింది.ఈ 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో టీ-హబ్ 3,300కు పైగా స్టార్టప్‌లకు మార్గదర్శనం చేస్తూ, వాటి విస్తరణకు కీలక తోడ్పాటును అందించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులైన మెంటార్లు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక ప్రముఖులు మరియు గ్లోబల్ మార్కెట్లతో అనుసంధానం కల్పించడం ద్వారా ఔత్సాహిక వ్యవస్థాపకులకు వెన్నుదన్నుగా నిలిచింది. ఫలితంగా ఎన్నో స్టార్టప్‌లు కేవలం ఆలోచన స్థాయి నుంచి విజయవంతమైన వ్యాపార సామ్రాజ్యాలుగా రూపాంతరం చెందాయి.

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ఆకాంక్షలకు, ఆవిష్కరణల స్ఫూర్తికి టీ-హబ్ ప్రస్తుతం దర్పణంగా నిలుస్తోంది. ఇక్కడి అద్భుతమైన ఎకోసిస్టమ్ దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలవడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను ప్రముఖ ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ఆధునిక మౌలిక వసతులు, పరిశోధనలకు అనువైన వాతావరణం కలగలిసి ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థలను, పరిశోధకులను నగరానికి ఆకర్షిస్తున్నాయి.టీ-హబ్ ప్రారంభోత్సవ సమయంలో




దిగ్గజ పారిశ్రామికవేత్త దివంగత రతన్ టాటా గారు ప్రశంసిస్తూ.. "టీ-హబ్ ఆధునిక భారతదేశానికి సరికొత్త ముఖచిత్రం" అని కొనియాడారు.

ఆయన అన్న మాటలను నిజం చేస్తూ, సరికొత్త ఆలోచనలకు ప్రాణం పోస్తూ, యువతలోని నవకల్పనలకు పదును పెడుతూ టీ-హబ్ తన అద్భుత ప్రస్థానాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తోంది.




# స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫ్లిప్‌కార్ట్..

## ఆగస్టు 15 నుంచి ఫుడ్ డెలివరీ రంగంలోకి..

ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ త్వరలో ఆహార డెలివరీ రంగంలోకి కూడా అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్, క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న సంస్థ ఆగస్టు 15వ తేదీ నుంచి బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ త్వరలో ఆహార డెలివరీ రంగంలోకి కూడా అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్, క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న సంస్థ ఆగస్టు 15వ తేదీ నుంచి బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం దేశంలో ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో జొమాటో, స్విగ్గీ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇటీవల రాపిడో కూడా 'ఓన్లీ' పేరుతో ఈ రంగంలోకి ప్రవేశించగా, ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ కూడా పోటీకి సిద్ధమవుతోంది
ప్రస్తుతం జొమాటో, స్విగ్గీలు రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి 16 నుంచి 30 శాతం వరకు కమిషన్ వసూలు చేస్తున్నాయి. అయితే ఫ్లిప్‌కార్ట్ మాత్రం రెస్టారెంట్ల నుంచి సుమారు 10 శాతం కమిషన్ మాత్రమే వసూలు చేయాలని యోచిస్తోంది. తక్కువ కమిషన్‌తో ఎక్కువ రెస్టారెంట్లను ఆకర్షించాలన్న వ్యూహాన్ని సంస్థ అమలు చేస్తోంది. మొదటి దశలో బెంగళూరులో సేవలను ప్రారంభించిన తర్వాత వినియోగదారుల స్పందనను బట్టి ఇతర నగరాలకూ విస్తరించాలని ఫ్లిప్‌కార్ట్ ప్రణాళిక రూపొందించింది ఫుడ్ డెలివరీ విభాగం కోసం ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేకంగా మరో యాప్‌ను తీసుకురాబోతోంది. (ఖీశ్రీఅజూఎఖీ ూబస్త్రబర్ 15 శ్రీఖబఅఎష్ట్ర). ఇప్పటికే రెస్టారెంట్లను భాగస్వాములుగా చేర్చే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ పెరిగితే వినియోగదారులకు మెరుగైన ఆఫర్లు, తక్కువ డెలివరీ ఛార్జీలు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో రెస్టారెంట్లకు కూడా తక్కువ కమిషన్ కారణంగా అదనపు ప్రయోజనం చేకూరే అవకాశముంది.

# ఐటీ రిటర్నులు ఈ-వెరిఫై చేసుకోండిలా..




ఐటీ రిటర్నుల ఫైలింగ్ ముగిసింది. ఇప్పటికే చాలా మంది తమ రిటర్నులు ఫైల్ చేసి ఉంటారు. అయితే మనం ఫైల్ చేసిన రిటర్న్ సరిగా ఉందా? లేదా? ఏమైనా తప్పులు ఉన్నాయి? అనే విషయాలను ఎలక్ట్రానిక్ (ఈ)-వెరిఫై చేసుకోవాల్సిన అవసరం ఉంది. రిటర్న్ ఫైల్ చేసిన నెల రోజుల లోపు ఈ-వెరిఫై పూర్తి చేయాలి. తప్పొప్పులు, తేడాలు ఉంటే వాటిని సవరించి నెల రోజుల లోపు మళ్లీ ఫైల్ చేయాలి. ఒకవేళ మీ రిటర్నులో తప్పులు, పొరపాట్లు ఉంటే ఐటీ శాఖ..ఆ రిటర్న్‌ను ఇన్‌వ్యాలిడ్ లేదా ఇన్‌కంప్లీట్ జాబితాలో పెట్టే ప్రమాదం ఉంది. అదే జరిగితే మీకు రావలసిన రిఫండ్ ప్రాసెస్ ప్రక్రియ కూడా ఆలస్యమవుతుంది.
ఈ-వెరిఫికేషన్ ఎలా?
ముందుగా ఈ-ఫైలింగ్ పోర్టల్ అఅఎశీఎఱుఱ.స్త్రశీజ.అఅ కు వెళ్లి 'ఈ-వెరిఫై రిటర్న్'పై క్లిక్ చేయాలి.
తరువాత మీ పాన్ నంబరు, అసెస్‌మెంట్ ఇయర్, అక్‌నాలెడ్జ్‌మెంట్ నంబరు ఎంటర్ చేయాలి.ఒకవేళ అన్ని వివరాలు లేకపోతే పాన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి 'మై అకౌంట్'లోకి వెళ్లి 'ఈ-వెరిఫై రిటర్న్'పై క్లిక్ చేయాలి.

# అల్యూమినియం ఫాయిల్‌లో ఉంచిన ఆహారాలను తింటున్నారా.. అయితే జాగ్రత్త..



అల్యూమినియం ఫాయిల్ ప్రస్తుతం ప్రతి ఇంట్లో కనిపించే వంటింటి వస్తువుగా మారింది. భోజనం ప్యాక్ చేయడం, గ్రిల్ చేసిన చేపలు, చికెన్, కూరగాయలు వండడం వంటి అనేక పనులకు దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు ఉంచడం లేదా అందులోనే వండడం వల్ల కొంత అల్యూమినియం ఆహారంలోకి చేరే అవకాశం ఉంటుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పుల్లని, మసాలా ఎక్కువగా ఉండే ఆహారాల విషయంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అల్యూమినియం పాత్రలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇవి తక్కువ ధరలో లభించడం, శుభ్రం చేయడం సులభం కావడం వల్ల చాలామంది వీటినే ఎంచుకుంటున్నారు. సాధారణంగా అల్యూమినియం పాత్రల్లో వంట చేయడం వల్ల పెద్దగా ప్రమాదం ఉండదని భావించినప్పటికీ, అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు చుట్టి ఉంచడం మాత్రం ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### ఏం జరుగుతుంది..

అల్యూమినియం స్వల్ప పరిమాణంలో శరీరంలోకి వెళ్లినా సాధారణంగా అది శరీరం నుంచి బయటకు వెళ్లిపోతుంది. అందువల్ల తక్కువ స్థాయిలో దీనికి గురికావడం పెద్దగా హానికరం కాదు. అయితే చాలామంది సిఫార్సు చేసిన పరిమితికి మించి అల్యూమినియాన్ని పరోక్షంగా తీసుకుంటున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి. మొక్కజొన్న, ఉప్పు, పసుపు రంగు చీజ్‌లు, కొన్ని మూలికలు, మసాలా దినుసులు, టీ వంటి పదార్థాల్లో కూడా అల్యూమినియం కొంతమేర ఉంటుంది. తాగునీటిని శుద్ధి చేయడానికి ఉపయోగించే అల్యూమినియం సల్ఫేట్ కూడా దీనికి ఒక ఉదాహరణ. కొన్ని పరిశోధనల్లో అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న వారి మెదడు కణజాలంలో అల్యూమినియం స్థాయిలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే అల్యూమినియం మెదడు కణాల ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని, ఎముకల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారిలో సమస్యలను మరింత పెంచే అవకాశాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు తెలియజేశాయి.

### ఈ ఆహారాలతో ఇంకా అధికం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔూూ) తెలిపిన ప్రకారం అల్యూమినియం ఫాయిల్‌లో వండిన ఆహారంలో అల్యూమినియం అనుమతించిన పరిమితిని మించి చేరే అవకాశం ఉందని వెల్లడైంది. ముఖ్యంగా టమాటా, నిమ్మరసం, వెనిగర్ వంటి పుల్లని పదార్థాలు లేదా మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాల్లో ఈ ప్రక్రియ మరింత వేగంగా జరుగుతుంది. ఆమ్ల స్వభావం కలిగిన ఆహారం అల్యూమినియం పొరను కరిగించి ఆహారంలో కలిసేలా చేస్తుంది. బేక్ చేసే వంటకాల కోసం అల్యూమినియం ఫాయిల్‌కు బదులుగా గాజు (గ్లాస్‌వేర్) లేదా పింగాణీ (పోర్సిలైన్) పాత్రలను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఆహారంతో రసాయనిక ప్రతిచర్యలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉండటంతో సురక్షితమైన ప్రత్యామ్నాయాలుగా చెబుతున్నారు.
చల్లని ఆహారాన్ని అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి ఉంచడం సాధారణంగా సురక్షితమే అయినప్పటికీ, అది కూడా ఎక్కువసేపు ఉంచకూడదు. ఆహారం ఎంత పుల్లగా లేదా మసాలా ఎక్కువగా ఉంటే అంతే వేగంగా అల్యూమినియం అందులోకి చేరే అవకాశం ఉంటుంది.

### అల్యూమినియం పాత్రల సంగతేంటి..

అల్యూమినియం పాత్రల విషయానికి వస్తే.. వాటి ఉపరితలంపై సహజంగా ఏర్పడే ఆక్సైడ్ పొర ఆహారంలోకి అల్యూమినియం చేరకుండా కొంత రక్షణ కల్పిస్తుంది. అయితే పాత్రలను గట్టిగా రుద్ది శుభ్రం చేయడం వల్ల ఈ రక్షణ పొర తొలగిపోయే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పాత్రలో కొద్దిసేపు నీటిని మరిగించడం ద్వారా మళ్లీ సహజ ఆక్సైడ్ పొర ఏర్పడి రక్షణ కల్పిస్తుంది. అందువల్ల అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ చేయకుండా ఉండటం మంచిది. ముఖ్యంగా పుల్లని, మసాలా ఎక్కువగా ఉండే ఆహారాలను అల్యూమినియం ఫాయిల్‌లో వండడం లేదా ఎక్కువసేపు చుట్టి ఉంచడం ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు

# వయస్సు పెరిగే కొద్దీ తగ్గే మెటబాలిజం..

## దీన్ని పెంచుకోవాలంటే ఏం చేయాలి..?



వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలోని జీవక్రియల (మెటబాలిజం) వేగం సహజంగానే తగ్గుతుంది. చిన్నతనంలో సులభంగా జీర్ణమయ్యే ఆహారం, పెరుగుతున్న వయసులో అంత తేలికగా జీర్ణం కాకపోవడంతోపాటు బరువు కూడా త్వరగా పెరిగే అవకాశం ఉంటుంది. నిద్రలేమి, ధూమపానం, మద్యం సేవించడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అలవాట్లు కండరాల పరిమాణాన్ని తగ్గించి మెటబాలిజాన్ని మరింత మందగింపజేస్తాయి. అయితే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా జీవక్రియల వేగాన్ని మెరుగుపరచుకోవచ్చు. కారంగా ఉండే ఆహారం తీసుకోవడం మెటబాలిజాన్ని పెంచడంలో కొంతవరకు సహాయపడుతుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ అనే పదార్థం కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారం వల్ల వచ్చే అదనపు బరువును తగ్గించడంలో ఉపయోగపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒక గ్రాము మిరపకాయ ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మరో అధ్యయనం ప్రకారం ఐదు గ్రాముల మిరపకాయలు తీసుకోవడం వల్ల సుమారు 30 నిమిషాల పాటు మెటబాలిజం దాదాపు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తేలింది.

### కార్డియో వ్యాయామాలు, ప్రోటీన్లు..

కార్డియో వ్యాయామాలు కేలరీలను కరిగించడంలో ఉపయోగపడితే, వెయిట్ ట్రైనింగ్ కండరాల పరిమాణాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొవ్వుతో పోలిస్తే కండరాలు ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తాయి. వృద్ధులపై నిర్వహించిన ఒక అధ్యయనంలో 16 వారాల పాటు రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయడం వల్ల శరీరంలోని కొవ్వు తగ్గడంతోపాటు మెటబాలిజం కూడా మెరుగుపడినట్లు గుర్తించారు. కొన్ని పరిశోధనల్లో ఈ వ్యాయామం మహిళల్లో మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం కూడా మెటబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రోటీన్ కండరాల నిర్మాణాన్ని, సంరక్షణను ప్రోత్సహిస్తుంది. దీంతో శరీరం విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ప్రోటీన్లను ఎక్కువగా తీసుకునే వారిలో విశ్రాంతి సమయంలో జీవక్రియల వేగం అధికంగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

### అల్పాహారాన్ని కచ్చితంగా తీసుకోవాలి..

ఉదయం అల్పాహారాన్ని ఎప్పుడూ మానేయకూడదు. ముఖ్యంగా ప్రోటీన్ అధికంగా ఉండే పోషకాహారం తీసుకోవడం వల్ల రోజంతా అనవసరంగా చిరుతిండ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. మధ్య మధ్యలో తీసుకునే చిరుతిండ్లలో ఎక్కువగా చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే అవకాశం ఉంటుంది. బ్రిటన్‌లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం నిద్రలేచిన రెండు గంటలలోపు అల్పాహారం తీసుకునే వారు రోజంతా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసే అవకాశం ఉంటుందని వెల్లడైంది. తగినంత నీరు తాగడం కూడా మెటబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
నీరు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంతోపాటు కడుపు నిండిన భావన కలిగించి అతిగా తినకుండా చేస్తుంది. ముఖ్యంగా చల్లని నీటి కంటే గోరువెచ్చని లేదా గది ఉష్ణోగ్రతలో ఉండే నీటిని తాగడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# బరువు పెరుగుతామనే భయం ఉందా..




బరువు పెరుగుతామనే భయంతో చాలామంది కొన్ని ఆహారాలను పూర్తిగా దూరం పెడుతుంటారు. అయితే అన్ని ఆహారాలు ఒకేలా ఉండవు. జీరో కేలరీ ఆహారాలు అంటూ ఏవీ లేకపోయినా, కొన్ని ఆహారాల్లో పీచు (ఫైబర్), ప్రోటీన్ ఎక్కువగా ఉండటం వల్ల అవి ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో ఆకలి తగ్గి, మొత్తంగా తీసుకునే కేలరీల పరిమాణం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కూడా అందిస్తాయి.
ఉడికించిన బంగాళాదుంపలను చాలామంది అధిక కార్బోహైడ్రేట్లు ఉన్నాయని దూరం పెడతారు. కానీ ఉడికించిన బంగాళాదుంపలు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారం. ఇవి ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉంటాయి. సహాయపడుతుంది. ఉడికించిన బంగాళాదుంపలను చల్లార్చి మళ్లీ వేడి చేసి తింటే రెసిస్టెంట్ స్టార్చ్ పరిమాణం పెరిగి మరింత ప్రయోజనం కలిగించే అవకాశం ఉంటుంది.

### కోడిగుడ్లు, చేపలు..

గుడ్లు శరీరానికి అవసరమైన దాదాపు అన్ని కీలక పోషకాలను అందించే ఆహారం. ఒక గుడ్డులోని ప్రోటీన్‌లో సగం వరకు పచ్చసొనలోనే ఉంటుంది. గుడ్లు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం ఉదయం అల్పాహారంగా గుడ్లు తిన్నవారు రోజంతా తక్కువ కేలరీలు తీసుకున్నట్లు, కూడా ఇతరులతో పోలిస్తే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చేపల్లో ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు, అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి.

# రామాయణ: పార్ట్-1 రివ్యూ



రామాయణం పార్ట్ 1
నటీనటులు: రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి, సన్నీ డియోల్, కాజల్, శోభన, అరుణ్, రవి దూబే, లారా దత్తా తదితరులు
నిర్మాణ సంస్థ: ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ణచీజు+, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్
నిర్మాత: నితేష్ తివారీ
దర్శకుడు: నితేష్ తివారీ
సంగీతం: జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్
విడుదల తేది: నవంబర్ 5, 2026

ధర్మం అంటే ఏంటి? మాట విలువ ఏంటి? ఆశ మనిషిని ఎలా కృంగదీస్తుంది? స్వామి భక్తి అంటే ఏంటి? ఇలా.. ఎన్నో ప్రశ్నలకు సమాధానం ఆది కావ్యం రామాయణం. ఈ కావ్యానికి ఇప్పటికే ఎంతో మంది దృశ్యరూపం ఇచ్చారు. తెలుగుతో పాటు అన్ని భాషల్లోనూ ఎన్నో సినిమాలు తెరకెక్కాయి. ఇప్పుడు, సరికొత్త హంగులతో భారీ బడ్జెట్‌తో వచ్చిన చిత్రం రామాయణ(తెలుగులో రామాయణం). రణ్‌బీర్, యశ్, సాయి పల్లవి లాంటి పాన్ ఇండియా స్టార్స్ నటించడంతో మొదటి నుంచే ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. మరి ఆ అంచనాలను ఈ 'రామాయణం' అందుకుందా లేదా? రివ్యూలో చూద్దాం.

కథేంటంటే..
రామాయణం..అందరికీ తెలిసిన కథే. ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. దర్శకుడు నితేష్ తివారీ రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. మొదటి భాగంలో రావణుడు ఘోర తపస్సు చేసి, బ్రహ్మ నుంచి వరం పొందడం దగ్గర్నుంచి కథను ప్రారంభించాడు. అతను లంకను స్వాధీనం చేసుకోని ముల్లోకాలకు అధిపతి గా మారడం.. ఆ తర్వాత రాముడి జననం.. యోధుడిగా మారడం..సీతా పరిణయం.. వనవాసం.. శూర్పణక పరాభవం, మాయా లేడిని పంపి, సీతని రావణుడు ఎత్తుకు రావడం వరకు పార్ట్ 1లో చూపించాడు. ఇక రావణుడితో రాముడి యుద్ధం పార్ట్ 2లో ఉండబోతుంది.

ఎలా ఉందంటే..
ఇది అందరికీ తెలిసిన కథే. దాన్ని తెరపై ఎలా చూపించారనేది ముఖ్యం. విజువల్స్ పరంగా మ్యాజిక్ చేయాలి. నేటి తరాన్ని సైతం ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. ఈ విషయం దర్శకుడి నితీష్ తివారీకి బాగా తెలుసు. అందుకే తెలిసిన, జన బాహుళ్యంలో ప్రచారం ఉన్న రామాయణ కథనే ఎంచుకొని..దానికి విజువల్ ట్రీట్ ఇచ్చాడు. అదే సమయంలో ఎమోషన్స్ కూడా మిస్ కానివ్వలేదు. కానీ ప్రతి విషయం డీటెయిల్డ్ చూపించడంతో నిడివి పెరిగి(దాదాపు మూడు గంటలు) ల్యాగ్ ఫీలింగ్ రావొచ్చు. కొన్ని చోట్ల సీరియల్స్ లా సాగదీసినట్లుగా అనిపిస్తుంది. విజులవ్స్ పరంగా మాత్రం ఈ సినిమా నెక్ట్స్ లెవల్ అని చెప్పొచ్చు. రావణుడితో జటాయువు పోరాటం చేసే సీన్ ఈ సినిమాకే హైలెట్.

## సినిమా న్యూస్

## ఓటీటీలోకి జైలర్2..

### స్ట్రీమింగ్ డేట్ ఇదే.. అధికారిక ప్రకటన

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా వచ్చిన లేటెస్ట్ యాక్షన్ మూవీ జైలర్-2. గతంలో రిలీజైన జైలర్‌కు సీక్వెల్‌గా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ మూవీకి దర్శకత్వం వహించారు. దసరా కానుకగా గత నెల 15న థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ బాక్సాఫీస్ ని షేక్ చేసింది. ఇప్పటికే రూ.800 కోట్ల వసూళ్లకు చేరువలో ఉంది.

నవంబర్ 12 నుం

అయితే ఈ మూవీ మరోసారి ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. నవంబర్ 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ స్ట్రీమింగ్ కానుంది. ఈమేరకు ప్రైమ్ వీడియో ఈ స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది.కాగా ఈ చిత్రంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించగా.. రమ్యకృష్ణ, యోగిబాబు కీలక పాత్రల్లో కనిపించారు. మిథున్ చక్రవర్తి, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ తదితరులు ఈ చిత్రంలో భాగమయ్యారు. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందించారు.



## రాధికా ఆప్టే వ్యాఖ్యలకు పాయల్ రాజ్‌పుత్ స్ట్రాంగ్ కౌంటర్.. 'టాలీవుడ్ వల్లే ఈ


ప్రముఖ తెలుగు చిత్ర దర్శకుడు పరిశ్రమపై నటి రాధికా ఆప్టే చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె వ్యాఖ్యలపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో నటి పాయల్ రాజ్‌పుత్ స్పందించారు. టాలీవుడ్‌కు మద్దతుగా నిలుస్తూ రాధికా ఆప్టే వ్యాఖ్యలకు గట్టిగా బదులిచ్చారు. తనకు గుర్తింపు, అవకాశాలు ఇచ్చిన తెలుగు చిత్ర పరిశ్రమ గురించి ఇన్నేళ్ల తర్వాత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడిన పాయల్ రాజ్‌పుత్.. తనకు టాలీవుడ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తున్నానని, ఇక్కడ ప్రతి ఒక్కరికీ ఇచ్చే గౌరవం, కొత్తవారిని ఆహ్వానించే విధానం తనకు ప్రత్యక్షంగా తెలుసని చెప్పారు.




## 'చంద్రయాన్' నుంచి 'చీఫ్ సైంటిస్ట్' శివ కుమార్ దీకొండ పాత్ర పరిచయం!

వేణు ఊడుగుల సమర్పణలో, 'సింబ స్క్రీన్ స్టోరీస్' పతాకంపై ప్రవీణ్ మొలక నిర్మిస్తోన్న వైవిధ్యమైన చిత్రం 'చంద్రయాన్' గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ హిలేరియస్ అడ్వెంచర్ కామెడీ సినిమా నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఈ చిత్రం విడుదలకు ఇంకా 8 రోజులే ఉండడంతో పాత్రలను పరిచయం చేస్తుంది చిత్రయూనిట్. ఇందులో భాగంగా హీరోగా నటిస్తున్న శివ కుమార్ దీకొండ పాత్రను చిత్ర యూనిట్ అత్యంత ఆసక్తికరంగా పరిచయం చేసింది. ఈ మిషన్ వెనుక ఉండే అసలు మాస్టర్ మైండ్ మరియు 'చీఫ్ సైంటిస్ట్' అంటూ శివకుమార్ దీకొండ లుక్‌తో కూడిన కొత్త ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు.

సమాజంలో తమని తక్కువ చేసి మాట్లాడిన వారి ముందు తమ ప్రతిభను నిరూపించుకోవాలని నలుగురు గ్రామీణ యువకులు గట్టిగా నిర్ణయించుకుంటారు. ఎవరికీ అంతుచిక్కని ఆలోచనగా సొంతంగా ఒక రాకెట్ తయారు చేసి, ఏకంగా చంద్రమండలానికి వెళ్లాలని వారు సాహసించడమే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ క్రమంలో మందమర్రి నుంచి చందమామ వరకు సాగే ఈ ప్రయాణం ఆద్యంతం నవ్వులు పూయించనుంది. శివ కుమార్ దీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, 'బలగం' సత్యనారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు




## సుధీర్ 'గోట్' ట్రైలర్ చూశారా?




సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం ' ఎమ్ చంద్రశేఖర్ నిర్మాణంలో రూపొందుతోంది. ఈ సినిమా నవంబర్ 12న విడుదల కానుంది. ఈ క్రమంలో ఈ రోజు (గురువారం) ట్రైలర్ విడుదలైంది. దీనిని హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేశారు. క్రికెట్ నేపథ్యంలో తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

నిర్మాత మాట్లాడుతూ 'సుడిగాలి సుధీర్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెతో నిర్మించిన చిత్రమిది. ఆయన క్రేజ్‌కు తగ్గ కథను ఎన్నుకుని ఈ సినిమా నిర్మించాం. ఆయన పాత్ర నేటి యువత కనెక్ట్ అవుతుంది. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది' అని అన్నారు.

కాగా చిత్రంలో మొట్ట రాజేంద్రన్, సర్వదమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, పృథ్వీ, ఆడుకలం నరైన్, ఆనంద రామరాజు, పమ్మిసాయి, చమ్మక్‌చంద్ర, నవీన్ నేని తదితరులు కీలక పాత్రల్లో నటించారు.